సాక్షి
గుంటూరు
సోమవారం, 2, అక్టోబర్, 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు.



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండను ఆదివారం పర్యాటకులు సందర్శించారు. లాంచీల ద్వారా పర్యాటకశాఖకు రూ.48,200 ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

దుర్గమ్మ సేవలో..



విజయవాడ : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి. రమేష్ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

న్యూస్‌రీల్

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రోజా బదిలీ



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్) : గుంటూరు నగర పాలక సంస్థలో అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పెద్ది రోజాను కృష్ణా జిల్లా డీఆర్వోగా బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డెప్యూటీ కలెక్టర్ హోదాలో రెవెన్యూ సర్వీసెస్ నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్(ఎంఏయూడీ) సర్వీస్‌కు కేటాయింపబడి గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా గత ఏడాది విధుల్లో చేరారు. ప్రస్తుతం డెప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా పెద్ది రోజాను ఎంఏయూడీ సర్వీస్ నుంచి వెనుక్కు తీసుకుని కృష్ణాజిల్లా డీఆర్వోగా బదిలీ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష జయప్రదం చేద్దాం

కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. ఆదివారం తన కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ హాలు నుంచి వెబ్ ఎక్స్ మీటింగ్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల కల్లా స్పెషలిస్టు డాక్టర్లంతా విధుల్లో తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. వైద్యశిబిరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్వో కె.వినాయకం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు దినం కావటంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

బుక్ ఫెస్టివల్ సొసైటీకి నూతన కార్యవర్గం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో 2023–24 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ గౌరవాధ్యక్షుడిగా బెల్లపు బాబ్జీ, అధ్యక్షుడిగా టి. మనోహర్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా జి. లక్ష్మి, కార్యదర్శిగా కె. లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి జి. నారాయణరావు, కోశాధికారిగా కె. రవి ఎన్నికయ్యారు. వీరితో పాటు వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎస్. వెంకట నారాయణ, విశ్వేశ్వరరావు, ఎ. భాస్కరరావు, ఎస్. రామారావు, పి. ప్రసాద్, బి. రవికుమార్, ఏబీఎస్ సాయిరామ్, కొల్లూరి, ఎస్ఎస్ నాగిరెడ్డి, పి. సుబ్రహ్మణ్యం, జె. నరసింహమూర్తి, కె. శ్రీనివాస్, వి. శ్రీనివాసరావు, బీవీ బసవరాజు ఎన్నికయ్యారు. ఈ ఏడాది నవంబర్‌లో విశాఖపట్నంలో పుస్తక మహోత్సవం నిర్వహించాలని సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసినట్లు అధ్యక్షుడు మనోహర్ నాయుడు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 525.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

స్వచ్ఛందంగా కదిలే

- ఉత్సాహంగా స్వచ్ఛతా హీ సేవ
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- వ్యక్తిగత పరిశుభ్రతతోనే స్వచ్ఛ నగరాలు సాధ్యం
- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడి



'స్వచ్ఛ'మేవ జయతే : గుంటూరులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, మేయర్ మనోహర్, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్లే స్వచ్ఛ నగరాలు సాధ్యమవుతాయని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఆదివారం గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బీఆర్ స్టేడియం వద్ద ఉన్న మున్సిపల్ రెడ్ ట్యాంక్ కాంప్లెక్స్‌లో స్వచ్ఛతా హీ సేవ ఏక్ తారీఖ్ ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ పరిసరాలను శుభ్రం చేశారు. మట్టి కుప్పలను తొలగించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని, ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆయా నగరాలు, గ్రామాలు స్వచ్ఛంగా మారుతాయన్నారు. అన్ని గ్రామ/వార్డ్ సచివాలయాల పరిధిలో జరుగుతున్న శ్రమదానం కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలు భాగస్వాములవుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కార్యక్రమం చేపట్టినా ప్రజలకు మేలు జరగాలనే ఆలోచన చేస్తారని, స్వచ్ఛత అంటే మనతోపాటు మన చుట్టుపక్కల వారి ఆరోగ్యాన్ని కాపాడిన వారమవుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలక సంఘాల్లో చెత్త తరలింపునకు ఈ–ఆటోలను అందుబాటులోకి తెచ్చారన్నారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చుకోవడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని చెప్పారు. దీనికోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కమిషనర్ కీర్తిచేకూరి మాట్లాడుతూ త్వరలో రెడ్ ట్యాంక్ కాంప్లెక్స్‌ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కాంప్లెక్స్‌లో రెడ్యూస్, రీ సైకిల్, రీ యూజ్ (ఆర్.ఆర్.ఆర్.)సెంటర్‌ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ స్వచ్ఛ గుంటూరు సాకారం దిశగా ముందుకు సాగుదామని చెప్పారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో స్వచ్ఛ గుంటూరు సాధనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రజలు, విద్యార్థులు అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజిల, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు రైల్వే స్టేషన్‌లో శ్రమదానం చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ, ఆయన సతీమణి ఆశాలత, రైల్వే అధికారులు

రైల్వే శాఖ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తన సతీమణి, గుంటూరు డివిజన్ మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు ఆశాలతతో కలిసి శ్రమదాన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 26 రైల్వే స్టేషన్‌లలో 215 యూనిట్లలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వెల్లడించారు. స్వచ్ఛత ప్రతిఒక్కరి బాధ్యతని చెప్పారు. డివిజన్ వ్యాప్తంగా 5వేల మందితో శ్రమదాన్ నిర్వహించినట్టు వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర పర్యాటక మంత్రిత్వ శాఖ 2023 సంవత్సరానికి టూరిస్ట్ ఫ్రెండ్లీ అవార్డును గుంటూరు స్టేషన్‌కు అందించడం సంతోషంగా ఉందన్నారు. గుంటూరు స్టేషన్ అభివృద్ధికి విశేష కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు శ్రీనివాస్, సైమన్, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

'భవిత' రిసోర్స్ పర్సన్ పోస్టుల మెరిట్ జాబితా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సమగ్రశిక్ష సహిత విద్య విభాగంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 33 సీడబ్ల్యూఎస్ఎన్ రిసోర్స్ పర్సన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ జాబితాను https://apie.apcfss.in/ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న వారు సర్టిఫికెట్ల నిమిత్తం నిర్దేశిత తేదీల్లో గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని సూచించారు. హెచ్ఐ, వీఐ విభాగాలకు సంబంధించిన అభ్యర్థులు ఈనెల 3న హాజరు కావాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే ఎంఆర్ విభాగంలో ఈనెల 4న వరుస క్రమంలో ఒకటి నుంచి 63 వరకు, 5న వరుస క్రమం 64 నుంచి 81 వరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు జిరాక్స్ కాపీల సెట్లతో రావాలని సూచించారు. దరఖాస్తు సమయంలో సమర్పించిన అన్ని రకాల ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారి సంతకంతో హాజరు కావాలని సూచించారు. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఈనెల ఆరో తేదీ నుంచి 9వ తేదీ వరకు స్కిల్స్, పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తామని, అభ్యర్థులు ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



వృద్ధ ఓటర్లను సత్కరించిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

వృద్ధ ఓటర్లకు సత్కారం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఆదివారం జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వృద్ధ ఓటర్లను కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్‌రావు, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, జీఎంసీ ఏసీ పెద్ది రోజా, కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ కల్యాణి, పశ్చిమ మండల తహసీల్దార్ సాంబశివరావు, డీసీ బి.శ్రీనివాస్, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

భూ రీసర్వేతో దశాబ్దాల సమస్యలకు పరిష్కారం

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: దశాబ్దాల సమస్యలకు జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం పరిష్కారం చూపించిందని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేఎం అగ్రహారంలో ఆదివారం రాత్రి భూ హక్కు పత్రాల పంపిణీ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని భూములు ఒకే సర్వే నంబర్‌లో నిషేధిత జాబితాలో ఉండటం వలన రైతులు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను మొదటి విడతలో అగ్రహారం గ్రామంలో ప్రారంభించినట్టు చెప్పారు. జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సర్వే డిజిటలైజేషన్ వల్ల భవిష్యత్‌లో క్రయవిక్రయాలు సులభతరమవుతాయని వివరించారు.

జీజీహెచ్‌లో ఆపరేషన్ థియేటర్లు ప్రారంభం



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, గిరిధర్, మేయర్ మనోహర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రూ.50 లక్షలతో ఆధునికీకరించిన ఆపరేషన్ థియేటర్లను ఆదివారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. సూపర్‌స్పెషాలిటీ ఆపరేషన్ థియేటర్, ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్, జనరల్ సర్జరీ ఆపరేషన్ థియేటర్, బ్లడ్ బ్యాంకులను, కొత్తగా ఏర్పాటు చేసిన 11 ఓపీ కౌంటర్లను ఎమ్మెల్యేలు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర పాలక సంస్థ మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూర్తితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. జనరల్ మెడిసిన్ వార్డు వద్ద మొక్కలు నాటారు. కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్యం అందించే చర్యలు చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, సజిల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ బీవీ సతీష్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజిని తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే భవిష్యత్తు

- నాలుగున్నరేళ్లలో అవినీతి రహిత పాలన
- విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో బడుగులకు పెద్దపీట
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ రావాలని, ఆయనే ఆంధ్ర రాష్ట్రానికి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం 'వై ఏపీ నీడ్స్ జగన్' సన్నాహక సమావేశంలో అంబటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ ప్రభుత్వమూ ఇంతవరకు ఇంతటి అద్భుత, విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టలేదని స్పష్టం చేశారు. నాలుగేన్నరేళ్ల అవినీతి రహిత పాలన దేశానికే ఆదర్శమని వివరించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ విధానాలను వివరించాలని చెప్పారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకూ నాణ్యమైన వైద్యం అందించే మహత్తర యజ్ఞం సాగుతోందని వివరించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాల నిర్వహణపై అంబటి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, పెండెం బాబూరావు, షేక్ నాగూర్ మీరాన్ మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ మౌలాలి, సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండల అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, సక్కా శ్రీనివాసరావు, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, రైతు సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృత్య సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నాట్య కళాకారులు

వినుకొండ(నూజెండ్ల): బెజవాడ చారిటబుల్ ట్రస్ట్, లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విష్ణుకుండినగర్‌లో రాష్ట్రస్థాయి భరతనాట్య సమ్మేళనం ఆదివారం వైభవంగా జరిగింది. కూచిపూడి, భరతనాట్యం ప్రక్రియల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది చిన్నారులకు జాతీయ నంది పురస్కారాలు, జాతీయ ఐరావత పురస్కారాలు, జాతీయ మయూరి పురస్కారాలు అందజేసినట్లు ట్రస్ట్ చైర్మన్ బి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ సాంబశివరావు మాట్లాడుతూ చిన్నారుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భరతనాట్య నిపుణురాలు పువ్వాడ ప్రతిభ సునీల్‌కుమార్, చందోలు నాగవాణి, డాక్టర్ చందోలు నాగేంద్రబాబు, జాజల మాల్యాద్రి, వంశీకృష్ణ, చంద్రశేఖర్, షేక్ చాన్‌బాషా, జి.నాగేంద్రుడు, కౌన్సిలర్లు ఎంఎస్‌కే బాషా, పాపసాని బ్రహ్మయ్య, కమిషనర్ వెంకయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ట్రస్ట్ కో–ఆర్డినేటర్ సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

నవంబర్ 5న ఎలక్ట్రికల్ కార్మికుల సమ్మేళనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 5న ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధనేకుల వెంకట సత్యనారాయణ, కె.శ్రీహరిరావు తెలిపారు. మాచవరంలోని విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఎలక్ట్రికల్ కార్మికుల సమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ లయోలా కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ సమ్మేళనంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన పదివేలకు పైగా ఎలక్ట్రికల్ కార్మికులు పాల్గొంటారన్నారు. అలాగే పలు కంపెనీల ఇంజినీర్‌లు మారుతున్న కాలానుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పరికాల ప్రదర్శన, శిక్షణ ఇస్తారన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయవాడ: దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విశేషంగా భక్తులు తరలిరావడంతో ఇంద్రకీలాద్రిపై సందడి వాతావరణం నెలకొంది. ఆదిదంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు పెద్ద ఎత్తున పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాలతోపాటు సూర్యోపాసన సేవలో విశేషంగా పాల్గొన్నారు. ఆయా సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఉదయం 11–40 గంటల నుంచి 12–10 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. అమ్మవారికి మహా నివేదన సమర్పించిన అనంతరం తిరిగి 12–20 గంటలకు దర్శనాలు ప్రారంభమయ్యాయి. సర్వ దర్శనంతోపాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్లలో భక్తులు బారులు తీరి కనిపించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ఈవో భ్రమరాంబ క్యూలైన్లను పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో సూర్యోపాసన సేవ

అమ్మవారి సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెనాలిలో 22.8 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా తెనాలి మండలంలో 22.8 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 0.8 మి.మీ. పడింది. సగటున 7 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు 16.2, కొల్లిపర 14.8, చేబ్రోలు 14.2, కాకుమాను 13.6, వట్టిచెరుకూరు 7.2, పొన్నూరు 6.4, ఫిరంగిపురం 5.8, మంగళగిరి 5.6, గుంటూరు తూర్పు 5, పెదనందిపాడు 3.6, గుంటూరు పశ్చిమ 3, పెదకాకాని 3, దుగ్గిరాల 1.2, తాడేపల్లి 1.2, తుళ్లూరు 1.2, మేడికొండూరు మండలంలో 1 మి.మీ. చొప్పున పడింది.

ఉత్తమ సేవలకు ఘన సన్మానం



గుంటూరు రూరల్: విధుల్లో అత్యద్భుతమైన ప్రతిభని కనపరుస్తూ, ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుంటున్న సీఐ బండారు సురేష్‌బాబుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఉత్కృష్ట సేవా పతకాన్ని అందించడం అభినందనీయమని జైజపాలి ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఒక ప్రైవేటు కార్యాలయంలో ఆదివారం సీఐ సురేష్‌బాబును ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నిబద్ధతతో పనిచేసే వారికి ఎల్లప్పుడూ అవార్డులు అందుతూనే ఉంటాయని ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు. సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో తన వంతుగా ప్రజా రక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నందిగామ: కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన నందిగామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పండుదొర తెలిపిన సమాచారం ప్రకారం... గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన లంకా శ్రీనివాసరావు (49)కు పెనుగంచిప్రోలు సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. అక్కడికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై ఆదివారం తెల్లవారుజామున బయలుదేరాడు. నందిగామ సమీపానికి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యతో విజ్ఞానం, ఉన్నత భవిష్యత్

- స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్ యస్. సురేష్‌కుమార్,
- ఇస్రో సైంటిస్ట్ ఐ. శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ సురేష్‌కుమార్

మంగళగిరి: విద్య ఒక్కటే విజ్ఞానంతో పాటు సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుస్తుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్, ఇస్రో సైంటిస్ట్ ఐ. శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నగర పరిధిలోని నూతక్కి విజ్ఞాన విహార్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో గణిత విజ్ఞాన మేళా, సాంస్కృతిక మహోత్సవాల్ని దక్షిణ మధ్య క్షేత్రా(ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణ)లకు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్. సురేష్‌కుమార్, ఐ. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. అన్ని భాషల్లో ప్రావీణ్యం సంపాదించడం వల్ల అనేక అవకాశాలు వస్తాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన 220 మంది విద్యార్థులకు గణిత శాస్త్రంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర విద్యా భారతి వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ జి. నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు హోణంగార్, విజ్ఞాన విహార విద్యా కేంద్రం కమిటీ చైర్మన్ డాక్టర్ వి. రఘురామిరెడ్డి, ప్రిన్సిపాల్ వి. సురేష్, విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ సంఘటన కార్యదర్శి ఓంకార నరసింహం, కోశాధికారి సుబ్బారావు, క్షేత్ర శారీరక ప్రముఖ్ కొనసం జగదీష్, ఏపీ ప్రాంత విజ్ఞాన మేళా విషయ ప్రముఖ్ సావిత్రి, క్షేత్ర కార్యక్రమ ఇన్‌చార్జి కృష్ణమోహన్, శైక్షిణిక్ ప్రముఖ్ పి. సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

చట్టసభల్లో నూర్ బాషాలకు అవకాశం కల్పించాలి

రాష్ట్ర అధ్యక్షుడు కె. పీర్ మహమ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న పీర్ మహమ్మద్

తాడేపల్లి రూరల్ : అన్ని రాజకీయ పార్టీలు చట్టసభల్లో నూర్ బాషాలకు అవకాశం కల్పించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె. పీర్ మహమ్మద్ కోరారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులోని రాష్ట్ర నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలు సుమారు 60 లక్షల మంది ఉన్నారని, ఇందులో నూర్ బాషాలు 20 లక్షల మంది దాకా ఉన్నారన్నారు. జనాభాపరంగా అత్యధికంగా ఉన్న నూర్ బాషాలకు చట్టసభల్లో ఏ పార్టీ అవకాశం కల్పించలేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీ అయితే నూర్ బాషాలకు చట్టసభల్లో అవకాశం కల్పిస్తుందో దానికే మద్దతు తెలుపుదామని ఆయన స్పష్టం చేశారు. ఈనెల 29న గుంటూరులో లక్షలాది మందితో నూర్‌బాషా సింహగర్జన సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. నూర్‌బాషాలు, మైనార్టీలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, గౌరవ సలహాదారు డాక్టర్ బాబన్, కోశాధికారి డాక్టర్ పర్ల దస్తగిరి, మహిళా అధ్యక్షురాలు డాక్టర్ డి. మస్తానమ్మ, యువజన అధ్యక్షులు పేద మస్తాన్, జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, బాజీవలి, ఆరిఫ్, గౌరవ సలహాదారులు షేక్ షావలి, నాగూర్‌వలి, ఇమాముల్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల విజేత గుంటూరు జిల్లా బాలుర జట్టు



గుంటూరుజిల్లా బాలుర జట్టుకు ట్రోఫీ బహూకరణ



ప్రకాశం జిల్లా బాలికల జట్టుకు ట్రోఫీ బహూకరణ

తెనాలి: తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ అంతర జిల్లాల అండర్–17 బాలబాలికల హ్యాండ్ బాల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విశాఖపట్నం జట్టు ద్వితీయ స్థానం దక్కించుకోగా, చిత్తూరు జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. కృష్ణాజిల్లా జట్టుకు ద్వితీయస్థానం, విశాఖపట్నం బాలికల జట్టు తృతీయ స్థానం దక్కించుకున్నాయి. పోటీల అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో డబుల్ హార్స్ మినపగుళ్ల సంస్థ జనరల్ మేనేజర్ టి.కృష్ణప్రసాద్, సునీల్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్.వినయకుమార్, తెనాలి స్పోర్ట్స్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, స్టేడియం ఇన్‌చార్జి కె.నాగరాజు బహుమతుల్ని ప్రదానం చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి



గోడపై పోస్టర్‌ను శుభ్రం చేస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహరనాయుడు, సూపరింటెండెంట్ కిరణ్

గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరూ పరిసరాల్ని శుభ్రం చేసుకోవడం అలవాటుగా మార్చుకోవడం ద్వారానే స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధించవచ్చని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గుంటూరు జీజీహెచ్, బీఆర్ స్టేడియం వద్ద జరిగిన పరిశుభ్రత కార్యక్రమంలో ఆయనతో పాటు కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహరనాయుడు, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, మహ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. జీజీహెచ్ ప్రహరీ మీద పోస్టర్లు తొలగించి, శుభ్రం చేశారు. రహదారిపై వ్యర్థాల్ని ఊడ్చి వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో కలసి శ్రమదానం చేస్తున్నారని చెప్పారు. జిల్లాలోని 238 గ్రామాల్లో 476 బృందాల ద్వారా 487 ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛతలో భాగంగా ప్రతి ఒక్కరు నిరంతరం ఇంటితో పాటు పరిసరాల్ని శుభ్రం చేయడం ద్వారా మన ప్రాంతాన్ని, జిల్లాను, రాష్ట్రాన్ని, దేశాన్ని శుభ్రంగా కన్పించేలా తీర్చిదిద్దవచ్చని వెల్లడించారు. భావి భారత పౌరులైన విద్యార్థులు కూడా స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్గి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బాల వజ్రబాబు, సజీల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, తహసీల్దార్ నగేష్, జీజీహెచ్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

నరసరావుపేట: జిల్లాలో గుర్తింపు కార్డులు కోసం కళాకారులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి దీప్తి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నిర్ణయించిందని చెప్పారు. అందువల్ల జిల్లాలో వివిధ కళా రంగాల్లో ఉన్న కళాకారులు గుర్తింపు కార్డు కోసం నిర్ణీత దరఖాస్తులో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, ఆర్టీసీ బస్టాండ్ వెనుక, ప్రకాష్ నగర్, నరసరావుపేట వారికి పూర్తి చేసిన దరఖాస్తును పంపాలని కోరారు. దరఖాస్తు కోసం కార్యాలయ వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఏపీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్ యాదవ్

కారెంపూడి: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోషియేషన్ (ఏపీఆర్ఎస్) రాష్ట్ర కార్యదర్శిగా కారెంపూడి తహసీల్దార్ జి. శ్రీనివాస్ యాదవ్ ఎన్నికయ్యారు. విజయవాడలో తుమ్మల పల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ విభాగాల రెవెన్యూ ఉద్యోగులు శ్రీనివాస్ యాదవ్ ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా చేబ్రోలు కృష్ణమూర్తి ఎన్నికపై వివిధ రెవెన్యూ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం

జేసీ రాజకుమారి



101 ఏళ్ల దేవదానాన్ని సత్కరిస్తున్న జేసీ రాజకుమారి

మంగళగిరి: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ప్రథమ ఆయుధమని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. రాజకుమారి స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా ఆదివారం 80 ఏళ్లు పై బడిన వృద్ధుల ఇళ్లకు జేసీతో పాటు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, డెప్యూటీ కలెక్టర్ కె లలిత, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, అడిషనల్ కమిషనర్ హేమామాలిని వెళ్లి సత్కరించారు. ఎన్నిసార్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు..ఓటు విలువ ఏమిటి? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలోని బ్యాంక్ కాలనీకి చెందిన 101 ఏళ్ల దేవదానం, 92 ఏళ్ల వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. జేసీ రాజకుమారి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. వందేళ్లు పైబడిన వయో వృద్ధులు నేటికీ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంటే, నేటి యువత నిర్లక్ష్యం వహించడం సరికాదని సూచించారు. నేటి యువత ఓటు విలువను తెలుసుకోవడంతో పాటు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా చూసి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వంద శాతం ఓట్లు పోలైనప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షణతో పాటు సమాజాభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ యశోధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మరియమాతను ఆశ్రయిస్తే దీవెనలు



పుణ్యక్షేత్ర ఆవరణలో భక్తుల సందడి

గుణదల (విజయవాడ తూర్పు): లోకమాతగా కీర్తించబడుతున్న మరియతల్లిని ఆశ్రయించిన భక్తులకు సకల ఆశీర్వాదాలు లభిస్తాయని గుణదల మేరీ మాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం సమిష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. మరియమాతను ఆశ్రయించిన భక్తులకు దీవెనలు లభిస్తాయన్నారు. భక్తుల పాలిట కల్పతరువుగా మరియతల్లి ఆశీర్వదిస్తుందని తెలిపారు. సర్వమానవుల పాపాలను పోగొట్టి సంరక్షించేందుకు లోక రక్షకుడైన క్రీస్తుకు జన్మనిచ్చిందని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు శిలువ రక్తం ద్వారా మన పాపాలకు క్షమాపణ లభించిందన్నారు. క్రీస్తు చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. బైబిల్ గ్రంథానుసారం భక్తులు నడుచుకోవాలని కోరారు. దేవుని కట్టడలను మన జీవితాల్లోకి అన్వయించుకుని శాంతి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనుదిన ప్రార్థన, బైబిల్ పఠనం మన దిన చర్యలో భాగంగా ఉండాలన్నారు. మన చుట్టూ ఉన్న వారితో ప్రేమ పూర్వకంగా నడుచుకుని పవిత్రమైన జీవితాన్ని గడపాలని వివరించారు. అనంతరం భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందచేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. మరియ మాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. శిఖరాగ్రాన ఉన్న శిలువ వరకు కాలి నడకన చేరుకుని ప్రార్థనలు చేశారు.

కృష్ణా జలాశయంలో స్నానానికి దిగి యువకుడు మృతి



తోట సాయి మృతదేహం

విజయపురి సౌత్: నాగార్జునసాగర్ కృష్ణవేణి పుష్కర్ ఘాట్ వద్ద స్నానానికి దిగి యువకుడు జలాశయంలో గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. గుంటూరు పట్టణంలోని బృందావనం గార్డెన్స్‌కు చెందిన తోట సాయి(22) స్నేహితులతో కలసి నాగార్జున సాగర్ వచ్చాడు. స్నానం చేసేందుకు విజయపురిసౌత్ పుష్కర్‌ఘాట్ వద్ద నదిలో దిగాడు. నీటిలో మునిగిపోవడంతో స్నేహితులు గమనించి కేకలు వేశారు. అక్కడ ఉన్న మత్స్యకారుల నదిలోకి దూకి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే యువకుడు మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తోట సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు.

సమయస్ఫూర్తితో శాంతిభద్రతలను పరిరక్షించాలి

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



మాబ్ ఆపరేషన్ డ్రిల్‌లో పోలీసు సిబ్బంది

బాపట్ల టౌన్: పోలీస్ సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు ఆదివారం పోలీస్ సిబ్బందికి మాబ్ ఆపరేషన్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యలు తలెత్తినపుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, అదుపులోనికి తీసుకొచ్చేందుకు ఎలా సమయస్ఫూర్తితో వ్యవహరించాలనే అంశాలపై పోలీసు సిబ్బందికి మాబ్ ఆపరేషన్ డ్రిల్‌ను నిర్వహించినట్లు తెలిపారు. స్టోన్ గార్డ్, హెల్మెట్, లాఠీ, మైక్, టియర్ గ్యాస్ మొదలైన పరికరాలు ఏ విధంగా ఉపయోగించాలి, లాఠీ చార్జ్ ఏ సమయంలో, ఏ విధంగా చేయాలనే విషయాలను వివరించినట్లు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది అవాంఛనీయ ఘటనలను సమర్థంగా ఎదుర్కోవడానికి ఈ డ్రిల్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగాసన పోటీలు



రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బాపట్ల అర్బన్: జిల్లా యోగాసన చాంపియన్ షిప్ -2023 స్థానిక ఎకో హౌస్‌లో యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. యోగాసన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ప్రావీణ్యతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కళ్ళం హరినాథ్‌రెడ్డి పాల్గొని, మాట్లాడారు. జిల్లాగా బాపట్ల ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా సంస్థ ద్వారా యోగాసన పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ముఖ్య అతిథి డాక్టర బి. శరత్‌బోస్ మాట్లాడుతూ యోగా సాధనతో శరీరానికి కావాల్సిన ప్రాణ శక్తి, రక్త ప్రసరణ పుష్కలంగా అందుతాయన్నారు. బాలిక గురుకుల పాఠశాల పీఈటీ పి.శాంతకుమారి, మునిసిపల్ హై స్కూల్ పీఈటీ కత్తి శ్రీనివాసరావు, శ్రీ వేమన యోగా సాధన విద్యా మందిర్ యోగ సాధకులు పాల్గొని, తమ ప్రావీణ్యత ప్రదర్శించారు. అక్టోబరు 14, 15 తేదీల్లో ఎంపికైన బాలబాలికలు భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సంస్థ జనరల్ సెక్రటరీ అల్లాడి రవికుమార్ పాల్గొన్నారు.

సబ్ జూనియర్ బాలికలు: (8–14 సంవత్సరాలు)ఎ. షర్మిలరాణి, జి. లాస్య, జె. అభిలాష, టి.సాహితి, పి. శ్రీనిధి.

సబ్ జూనియర్ బాలురు: కె.రోహిత్.

జూనియర్ బాలికలు: (14–18 సంవత్సరాలు) కె.శ్వేత, బి.ప్రవల్లిక, జి.మిథుల, టి.కీర్తన, బి.అంజలి

జీజీహెచ్‌లో ఆధునీకరించిన డయాలిసిస్ యూనిట్ ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, నన్నపనేని వెంకయ్య చౌదరి, సదాశివరావు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో కిడ్నీ రోగులకు కార్పొరేట్ ఆసుపత్రులు కంటే దీటుగా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం జీజీహెచ్‌లో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధునీకరించిన డయాలసిస్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జీజీహెచ్‌లో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. నాట్కో ట్రస్ట్ సేవలు ఎంతో విలువైనవని, ఆసుపత్రి అభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తోందని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వైద్య రంగానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని చెప్పారు. క్యాన్సర్ సెంటర్‌లో ప్రభుత్వం వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టి కోట్లాది రూపాయల వైద్య పరికరాలు అందజేసిందని వెల్లడించారు. కార్యక్రమంలో నాట్కో ట్రస్ట్ చైర్మన్ నన్నపనేని వెంకయ్య చౌదరి, వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, కో–ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ గుంది శివరామకృష్ణ, డాక్టర్ నిహారిక పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి డాడ్జి బాల్ పోటీల్లో బాపట్ల బాలుర జట్టు హవా



కప్ అందుకుంటున్న బాపట్ల జిల్లా బాలుర జట్టు



గెలుపొందిన ప్రకాశం జిల్లా బాలికల జట్టు

ప్రకాశం బాలికల జట్టు విజయకేతనం

కొల్లూరు: డాడ్జి బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో బాపట్ల జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుని, హవా చాటింది. ఆదివారం కొల్లూరు మండలం చిలుమూరు శ్రీరామ రూరల్ విద్యా సంస్థలో రాష్ట్ర స్థాయి 8వ సబ్ జూనియర్ బాలబాలికల డాడ్జి బాల్ చాంపియన్‌షిప్ అత్యంత ఉత్కంఠ భరితంగా సాగింది. రాష్ట్రంలోని 8 జిల్లాలకు చెందిన 16 బాల బాలికల జట్లు గెలుపు కోసం హోరాహోరీగా తలపడ్డాయి. బాపట్ల జిల్లా బాలుర జట్టు తొలి నుంచి దూకుడు ఆట తీరుతో ప్రత్యర్థి జట్లపై విజయ సాధించి, ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు ప్రత్యర్థి జట్లను మట్టికరిపించి విజయ కేతనం ఎగుర వేసింది. బాలుర విభాగంలో ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాల్లో ప్రకాశం, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో నెల్లూరు, బాపట్ల, కృష్ణా జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాలు సాధించాయి. ఈ పోటీలకు రాష్ట్ర డాడ్జి బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.గోపీకృష్ణ, బాపట్ల డాడ్జిబాల్ సంఘ కార్యదర్శి యు.గణేష్, కె.గోపాలకృష్ణ, జి.మనోహర్, అలి, సుబ్బారావు, బాబి, తేజ, రాజేంద్ర, కిశోర్ రిఫరీలుగా వ్యవహరించారు. విజేతలకు రాష్ట్ర డాడ్జి బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలసాని తులశీ విష్ణు ప్రసాద్, తెనాలి రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, ఈదర వెంకట పూర్ణచంద్ బహుమతులు ప్రదానం చేశారు.

'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం'పై సదస్సులు

గుంటూరు ఎడ్యుకేషన్: అవర్ స్టేట్ అవర్ లీడర్–వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం ఆధ్వర్యంలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై రెండు రోజులపాటు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 4న తాడేపల్లిగూడెం, 5న అమలాపురంలో నిర్వహిస్తున్న సదస్సుల్లో ప్రభుత్వ పరిపాలనపై మేధావులు పాల్గొని మాట్లాడతారని ఆయన తెలిపారు.